క్లుప్తంగా

పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జ్‌గా పవన్



మన్ననూర్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ తరుపున ఎన్నికల ఇన్‌చార్జ్‌గా నియామకం అయిన ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి పెర్మల పవన్‌ను ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ శుక్రవారం రాత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ ఎంపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేయాలని సూచించారు. అందరిని కలుపుగొని ముందుకువెళ్లాలని సూచించారు. ఎంపీ అభ్యర్థి మల్లు రవి రోడ్ షోలో పవన్‌ను సన్మానించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోడేరు: మండల కేంద్రంలోని ఆదివారం ఉదయం 9 గంటల నుంచి 11:30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాకేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ లైన్ కింద చెట్లు తొలగిస్తునట్లు దీంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణ పనులు ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సోమశిలలో అంజనేయ స్వామి నూతన దేవాలయ నిర్మాణానికి ఆలయ కమిటీ నిర్వాహకులు, గ్రామపెద్దలు శనివారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోవిందరెడ్డి, తాటికొండ కృష్ణ, మాజీ సర్పంచ్‌లు వెంకటస్వామి, వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్లకు మరమ్మతు

కొల్లాపూర్: పట్టణంలోని 10వ వార్డులో సీసీ రోడ్లకు శనివారం మరమ్మతు చేపట్టారు. మరమ్మతు పనులను కౌన్సిలర్ రహీంపాషా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపాలిటీ నిధుల ద్వారా పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. వార్డులో అవసరమైన చోట్ల సీసీ రోడ్లు నిర్మించనున్నట్లు తెలిపారు.

కరాటే గ్రేడింగ్ బెల్ట్‌లు ప్రదానం



చారకొండ: మండల కేంద్రంలో నూహర్జన్ పాఠశాలల్లో శనివారం షోటోకాన్ కరాటే డు ఇండియా ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు బెల్ట్ గ్రేడింగ్ టెస్టు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన వారికి జీకే మాస్టర్ ఫౌండర్ కృష్ణయ్య సీనియర్ ఎగ్జామినర్ శివకుమార్ బెల్ట్‌లు, సర్టిఫికేట్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జాన్‌హైడ్, మాస్టర్ గోపి, లక్ష్మి, పాఠశాల సిబ్బంది తదితరులు ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఎన్నిక

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట ఎంపీయూపీఎస్ పాఠశాలలో శనివారం అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్‌గా గ్రామానికి చెందిన గుడమోని ఎల్లమ్మను ఎన్నుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రధానోపాధ్యాయుడు రాంచందర్ సమక్షంలో ఎన్నుకున్నారు. అదేవిధంగా మరో 21 మందిని సభ్యులుగా ఎన్నుకునట్లు హెచ్ఎం పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామస్తులు గోవిందు, రాఘవేంద్ర, కురుమయ్య, నిరంజన్, బాలరాజు, రాజేష్ తదితర మహిళలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దు



పెంట్లవెల్లి: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగొద్దని ఎస్‌ఐ రామన్‌గౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మద్యం తాగి వాహనాలు నడిపితే జరిమానా విధించి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వాహనాలకు సంబంధించిన పత్రాలు సరిగ్గా ఉంచుకోవాలని కోరారు.

నేడు భారీ ర్యాలీ

అచ్చంపేట రూరల్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అచ్చంపేటలో మాల ఉద్యోగుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహిస్తునట్లు ఐక్య వేదిక డివిజన్ అధ్యక్షుడు కల్ములు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శి రవీందర్, కోశాధికారి శంకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు అధికసంఖ్యలో హాజరుకావాలని కోరారు.

అధ్వానంగా మట్టి రోడ్లు



ఉప్పునుంతల - కొత్త రాంనగర్ గ్రామాల మధ్య ఉన్న రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు

- కొరవడిన రోడ్ల నిర్వహణ
- ఇరువైపులా ఏపుగా పెరిగిన కంపచెట్లు

ఉప్పునుంతల: మండలంలో గ్రామాలను కలుపుతూ ఉన్న అనుసంధానపు మట్టి రోడ్ల నిర్వహణపై పాలకులకు, అధికారులకు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఏళ్ల తరబడిగా పర్యవేక్షణ లేకపోవడంతో రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగటంతో ముందుకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. రోడ్లపై గ్రామస్తులు ప్రయాణించేందుకు జంకుతున్నారు. ద్విచక్రవాహనాలపై వెళ్తండగా ఇరువైపులా కంప చెట్లు తగిలి ప్రమాదాలబారిన పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా మట్టి రోడ్లకు మరమ్మతు చేయకపోవడంతో గుంతలమయంగా మారాయి. దెబ్బతిన్న రోడ్లపై ప్రయాణించాలంటే రైతులు వెనకడుగు వేస్తున్నారు. వర్షకాలంలో మట్టిరోడ్లు బురదమయంగా మారడంతో అడుగుతీసి అడుగువేయలేని పరిస్థితి ఉంటుందని పలువురు వాపోయారు. రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు కమ్ముకొని బండ్ల డొంకలను తలపిస్తున్నాయి. చెరువుకట్టలపై కంప చెట్లు కమ్ముకొని ప్రమాదభరితంగా మారాయి. ఇక బీటీ రోడ్ల నిర్వహణ పనులు వంతకు గంతేసినట్లు చేసి వదిలేస్తున్నారు. కొన్ని చోట్ల బీటీ లేచి గోతులుపడి కంకర తేలాయి. రోడ్లపై ఎదురెదురు వాహనాలు కనిపించలేని దుస్థితి ఏర్పడింది.

ప్రయాణికులకు తప్పని తిప్పలు..

మండలంలో గ్రామాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లు మరింతగా అధ్వానంగా తయారయ్యాయి. ఉప్పునుంతల మెయిన్ రోడ్డు, పల్కపల్లి వైపు వెళ్లే



పెద్ద చెరువు కట్టపై ..

రోడ్డు కలుపుతూ బైపాస్ రోడ్డు మాదిరిగా ఉన్న బర్లడొంక రోడ్డు గోతులపడి పూర్తిగా దెబ్బతిన్నది. కొన్నేళ్లుగా ఈ రోడ్డు నిర్వాహణ అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఉప్పునుంతల నుంచి పెద్దాపూర్ వరకు, ఉప్పునుంతల నుంచి మొల్గర వరకు ఉన్న మట్టి రోడ్ల వెంట కంపచెట్లు కమ్ముకున్నాయి. మర్రిపల్లి నుంచి గట్టు తుమ్మెన్ స్టేజీ వరకు రెండున్నర కిలోమీటర్ల దూరం ఉన్న రోడ్డుపై కంకర లేసి వాహనాలు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు ఉన్న ఉన్న మట్టిరోడ్డుపై గోతులుపడ్డాయి. దాసరల్లిపల్లి నుంచి పెద్దాపూర్ వరకు, సదగోడు నుంచి తిర్మలాపూర్ వరకు ఉన్న మట్టి రోడ్లు పూర్తిగా దెబ్బతిన్నాయి, గుట్టమీది తండా వరకు ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. అదేవిధంగా కొరటికల్ పీడబ్ల్యూడీ రోడ్డు నుంచి వెల్టూరు వరకు ఉన్న లింక్‌రోడ్డు పరిస్థితి మరింత ఇబ్బందిగా ఉంది. రోడ్ల నిర్వహణపై పట్టించుకునే నాథుడు లేక రోడ్లకు పక్కన పొలాలు ఉన్న రైతులు కూడా ఇదే అదునుగా భావించి రోడ్లకు దగ్గరగా దున్నతూ డొంకలుగా మార్చుతున్నారు.

కమ్మేసిన కంప చెట్లు..

మట్టి రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉండగా బీటీ రోడ్ల నిర్వహణపై అధికారులు ఏమాత్రం పట్టింపులేకుండా వ్యవహరిస్తున్నారు. ఉప్పునుంతల నుంచి తాడూరు వరకు బీటీ రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు కమ్ముకొని డొంక రోడ్డుగా దర్శనమిస్తోంది. ఈరట్యానిపల్లి నుంచి పెనిమిళ్ల వరకు, పెనిమిళ్ల నుంచి సీబీ తండా వరకు ఉన్న బీటీ రోడ్ల నిర్వహణ పనులు చేపట్టడంలేదు. మామిళ్లపల్లి నుంచి దాసర్లపల్లి మీదుగా రామగిరి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా ధ్వంసమై వాహనాలు వెళ్లడానికి ఇబ్బందిగా మారింది. ఆయా గ్రామాలకు కలుపుతూ ఉన్న బీటీ రోడ్డు వర్షాలకు కోతకు గురికావడంతోపాటు అంచుల వెంట చెట్లు పెరిగాయి. దీంతో గ్రామాలకు బీటీ రోడ్లు ఉన్నాయన్న పేరేగాని సౌకర్యవంతంగా రోడ్లు లేవని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధతో తీసుకొని కంపచెట్లను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బీటీ పనులు చేపట్టాం

ఉప్పరిపల్లి నుంచి మామిళ్లపల్లి వరకు సీఆర్ఆర్ నిధులు రూ. 2,70 కోట్లతో పనులు చేపట్టాం. శాండ్ క్వారీ రోడ్డు నుంచి కొరటికల్ వరకు బీటీ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. ఎన్నికల ముందు మంజూరైన రోడ్లకు టెండర్లు పూర్తి కాలేదు. మండలంలో ఇతర మట్టి రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు కాలేదు.

– సందీప్‌రెడ్డి, పీఆర్ ఏఈ, ఉప్పునుంతల

అధికారులు పట్టించుకోవడం లేదు..



ఉప్పునుంతల నుంచి పల్కపల్లి వెళ్లే రోడ్డును కలుపుతూ అచ్చంపేట మెయిన్ రోడ్డు వరకు బైపాస్‌గా ఉన్న మట్టి రోడ్డు పూర్తిగా దెబ్బతింది. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదు. వర్షకాలంలో రోడ్డు బురదమయంగా మారుతున్నాయి. చిన్నపాటి వర్షానికే మడుగులను తలపిస్తున్నాయి. పొలాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నాం.

– తాండ్ర పుల్లయ్య, రైతు, ఉప్పునుంతల

వట్టెంలో ఉచిత వైద్య శిబిరం

బిజినేపల్లి : మండలంలోని వట్టెంలో శనివారం రాఘవరెడ్డి మెమోరియల్ ట్రస్టు, హైదరాబాద్ యశోద ఆస్పత్రి వారిచే సంయుక్తంగా ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి వందలాదిగా తరలివచ్చారు. ముందుగా కిష్టమ్మ– రాఘవరెడ్డి చిత్రపటాలకు సండడి ప్రతాప్‌రెడ్డి సోదరులు, సండడి దేవేందర్‌రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఉదయం 9 గంటల శిబిరం ప్రారంభమైంది. గుండె, ఎముకల, గర్భాశయ, స్త్రీ, పిల్లల, గ్యాస్టిక్ వంటి వైద్యనిపుణుల పర్యవేక్షణలో ఉచితంగా ఈసీజీ, 2డీకో, ఎముకల పరీక్ష, అబ్డామిన్, బీపీ, మధుమేహం వంటి వివిధ సమస్యలకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలోయశోద ఆస్పత్రి జనరల్ మేనేజర్ శ్రీనివాస్, మార్కెటింగ్ మేనేజర్ శ్రీధర్, వైద్యాధికారులు డా. రేణుక, డా. శశిధర్‌రెడ్డి, డా.జ్యోత్స్న టెక్నిషియన్ ఉమాదేవి, వైద్య బృందం పాల్గొన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బ్రహ్మోత్సవాల వాల్ పోస్టర్ల విడుదల

ఉప్పునుంతల: మండల కేంద్రంలో శ్రీరామ నవమి పురష్కరించుకొని నిర్వహించే కేదారేశ్వర చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం ఆలయం ఆవరణలో ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ నెల 16న మంగళవారం సాయంత్రం నుంచి 19వ తేదీ వరకు నాలుగు రోజులపాటు ఉత్సవాలు నిర్వహిస్తునట్లు ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు కొత్త పెద్ద జంగిరెడ్డి తెలిపారు. 16న ఎదుర్కోళ్లతో కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ నెల 17న బుధవారం ఉదయం 10,30 గంటలకు సీతారాముల కల్యాణం, సాయంత్రం కోలాటాల పోటీలు, ఈనెల 18న తెల్లవారుజామున రథోత్సవం, ఉదయం 10 గంటల నుంచి అంతర్రాష్ట్ర స్థాయి జూనియర్ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అదేవిధంగా ఈ నెల 19న గురువారం అంతర్రాష్ట్ర స్థాయి సీనియర్ విభాగం ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కొత్త పెద్ద జంగిరెడ్డి, సూరం వెంకట్‌రెడ్డి, నారాయణ్‌రెడ్డి, బాలింగం, కర్నాటి సత్యం, కదిరె బక్కయ్య, శేఖరాచారీ, వెంకట్రమణ, వెంకట్‌రెడ్డి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్లను విడుదల చేస్తున్న ఉత్సవాల కమిటీ సభ్యులు

అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయండి



లింగాలలో కరపత్రాలను విడుదల చేస్తున్న అంబేడ్కర్ సంఘం నాయకులు

లింగాల: భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని విజయవంతం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో కరపత్రాలను విడుదల చేశారు. ఈ నెల 14న మండల కేంద్రంలో మండలంలోని ఆయా గ్రామాల్లో నిర్వహించే జయంతి వేడుకల్లో గ్రామస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు కోరారు. కార్యక్రమంలో ఇమ్మడి సైదులు, సామ బాలస్వామి, నరసింహ్మ, శ్రీనివాసులు, చంద్రశేఖర్, అరుణ్‌కుమార్, బాలరాజు, అశోక్, బాబు, రాము, శివ, వీరస్వామి, ముక్తార్ తదితరులు పాల్గొన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లోని పాఠశాలల్లో అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లు రవి విజయమే లక్ష్యం

అచ్చంపేట రూరల్: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలిపే లక్ష్యంగా పని చేయాలని, ఈ నెల 14న జిల్లా కేంద్రంలో నిర్వహించే యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ సమీక్ష సమావేశాన్ని విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ జిల్లా అడ్మిన్, ఉపాధ్యక్షుడు వెల్టూరి రేణయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించనున్నామని, ముఖ్య అతిథులుగా మంత్రి జూపల్లి కృష్ణారావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి, ఎంపీ అభ్యర్థి మల్లురవి, చిన్నారెడ్డి, సంపత్ కుమార్, ఎమ్మెల్యేలు వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణ రెడ్డి, మేఘారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, సరిత, జగదీశ్వర్ రావు తదితరులు హాజరవుతున్నారని తెలిపారు. ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి గెలుపే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పనిచేయాలని ఆయన కోరారు. పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల యువజన కాంగ్రెస్ బాధ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

కల్వకుర్తిరూరల్: హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం అయ్యిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విమర్శించారు. శనివారం పట్టణంలోని వైఆర్ఆర్ కాంప్లెక్స్‌లో భారత రాష్ట్ర సమితి నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 120 రోజులు అయినా గ్యారంటీ పథకాలు అమలు కాలేదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదని, పెట్టుబడి సాయం రూ.15 వేలు ఎందుకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని ప్రశ్నించారు. మహిళలకు రూ.2500 ఎప్పుడు ఇస్తారని అడిగారు. వంద రోజుల్లోనే హామీలు అమలు చేస్తామని ఇప్పుడు మాట మార్చడం కాంగ్రెస్ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు.

18న కేటీఆర్ పర్యటన..

రాబోయే పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా భారత రాష్ట్ర కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ నెల 18న కల్వకుర్తి నియోజకవర్గంలో నిర్వహించే సమావేశాలకు హాజరవుతున్నట్లు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. కేటీఆర్ పర్యటనను నాయకులు, కార్యకర్తలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో గోలి శ్రీనివాస్‌రెడ్డి, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్, విజితారెడ్డి, దశరతనాయక్, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, విజయ్‌గౌడ్, కొండూరు గోవర్ధన్, శ్రీనివాస్‌యాదవ్, కే శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

హద్దురాళ్లు తొలగింపుపై ఫిర్యాదు

అచ్చంపేట రూరల్: రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లలో ఉన్న హద్దు రాళ్లను తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని శనివారం బాధితులు అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2008, 09 సంవత్సరంలో పట్టణ సర్వే నెంబర్ 26, 27లో ప్లాట్లను కొనుగోలు చేశామని, పట్టాదారుడు 59 మందికి రిజిస్ట్రేషన్ చేశాడని తెలిపారు. అప్పటి నుంచి ఆ ప్లాట్లు తమ ఆధీనంలోనే ఉన్నాయన్నారు. అదే పట్టాదారుడు ధరణిలో కొత్త పాస్‌బుక్‌లో అదనంగా భూమిని చేర్చుకుని వెంకటేష్ అనే వ్యక్తికి భూమి అమ్మాడని వివరించారు. సదరు వ్యక్తి స్థానికుల సాయంతో తమ ప్లాట్ల హద్దు రాళ్లను తొలగిస్తున్నాడని పేర్కొన్నారు. తమ ప్లాట్ల వద్దకు వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. త్వరలో విచారణ చేపట్టి న్యాయం చేస్తామని ఎస్‌ఐ రాములు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన మాజీ ఎమ్మెల్యే

కల్వకుర్తిరూరల్: మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శనివారం రాత్రి హైదరాబాద్‌లో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌లు మర్యాదపూర్వకంగా కలిశారు. వారి వెంట శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

రక్తదాన శిబిరం విజయవంతం

నాగర్‌కర్నూల్‌రూరల్: ప్రపంచ మేధావి రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ 133వ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, సమత సైనిక్‌దళ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని వైద్యాధికారి డా సుధాకర్‌లాల్ ప్రారంభించారు. రక్త దాతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కూన గోవర్ధన్, కార్యదర్శి తగిలి వెంకటపతి, గౌరవ అధ్యక్షుడు గుడిపాటి ప్రభాకర్, కోశాధికారి చేతమల్ల కోటేశ్వరి, సమతాసైనిక జిల్లా బాధ్యులు సామ రమేష్, పీఈటీ ఈశ్వర్, కృష్ణయ్య, సభ్యులు సింగోటం, నర్సింహ, జేఎల్ రాములు పాల్గొన్నారు.

PUBLIC NOTICE

General public is hereby informed that my client Sri M. Chennaiah has lost his original link deed, i.e., Regd. Agreement of Sale cum GPA Doc. No. 10143/2007 dt. 14-9-2007 executed by Ch. Venkat Rama Rao favouring S. Gouri Shankar & registered at SRO, Champapet, R.R. District relating to Plot No.207 Part adm. 150 Sq.yds. in Sy.No.60, Karmanghat(V), Saroornagar(M), R.R. District at Bus Stop, Nagarkarool on 15-12-2021 and not traced despite his best personal efforts and also the efforts of Police. Hence anyone, who finds that original Deed is hereby requested to hand over the same to the undersigned and it is assured that he/she will be duly remunerated.

Sd/- KVCMS SARMA Advocate
#5-77/6, Road No.3,
Teachers Guild Colony, Gurramguda,
Sagar Road, Hyderabad-501 510
Cont.: 9848081992

చోరీల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

లింగాల: శాంతి భద్రతల పర్యవేక్షణకు, చోరీల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో కీలకమని ఎస్‌ఐ జగన్మోహన్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ ఆవరణలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ సీసీ కెమెరాలతో కలిగే ప్రయోజనాలను వ్యాపారులకు అవగాహన కల్పించారు. నేరాలు, ఇతర అసాంఘీక పనులను తక్షణమే ఛేదించుటకు సీసీ కెమెరాలు సహకరిస్తాయని తెలిపారు. మారుతున్న కాలనుగుణంగా ఆధునిక కెమెరాలు ఏర్పాటు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కెమెరాల ఏర్పాటుకు ఆర్థిక వనరులు అవసరమని, అందుకు తమవంతుగా సహకరించాలని ఎస్‌ఐ వ్యాపారులను కోరారు. ప్రస్తుతం ప్రతి చోటా వైర్ లెస్ కెమెరాలను ఏర్పాటు చేస్తునట్లు పేర్కొన్నారు. దాతలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వ్యాపారులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ

ముమ్మరంగా విద్యార్థుల దుస్తుల కొలతలు



కొలతలు తీసుకుంటున్న మహిళా సంఘాల సభ్యులు

తాడూరు: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందజేసే ఉచిత దుస్తువులకు ఆయా గ్రామాల మహిళా సంఘాల ఆధ్వర్యంలో ముమ్మరంగా కొలతలు తీసుకుంటున్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో ఆయా గ్రామాలలోని మహిళా సంఘాలకు విద్యార్థుల యూనిఫాం కుట్టేందుకు అప్పగించిందని ఏపీఎం శేఖర్ తెలిపారు. గ్రామసంఘాల ఆధ్వర్యంలో పాఠశాలలోని విద్యార్థుల కొలతలను తీసుకొని యూనిఫాంను సిద్ధం చేస్తున్నామన్నారు.

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

వెల్దండ: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. శనివారం రాత్రి మండల కేంద్రంలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌కు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్లురవి మాట్లాడుతూ ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానంలో కాంగ్రెస్ జెండా ఎగురవేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే కసిరెడ్డి మాట్లాడుతూ ఆరుగ్యారంటీ పథకాలను అమలు చేస్తామన్నారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టాలని కోరారు. అనంతరం వెల్దండలో బీఆర్ఎస్‌కు చెందిన నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి మల్లురవి పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, చిత్తరంజన్ దాస్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మోతీలాల్‌నాయక్, మాజీ సర్పంచ్ భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్ యాదవ్, సింగిల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, పర్వత్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.



కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ నాయకులు

వాహనాల వేగ నియంత్రణకు చర్యలు



మండలంలోని తాండ్ర గేటు వద్ద జాతీయ రహదారిని పరిశీలిస్తున్న ఎన్‌హెచ్ బృందం

కల్వకుర్తి: వాహనాల వేగ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని జాతీయ రహదారి కన్సల్టెన్సీ అధికారి గంగాధర్ అన్నారు. శనివారం తాండ్ర గేటు, కొండారెడ్డిపల్లి గేటు వరకు ఉన్న జాతీయ రహదారిని ఎమ్మెల్యే నారాయణరెడ్డి సూచనల మేరకు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల నివారణకు ఇప్పటికే భారీకేడ్లు ఏర్పాటు చేశామన్నారు. అదనంగా బ్లింక్ సిగ్నల్స్, వైట్‌లైన్ల ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు పంపించి వాటిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. కొండారెడ్డి పల్లి గేటు వద్ద ఉన్న పండ్ల దుకాణానికి సంబంధించిన షెడ్లు, రోడ్డుకు ఇరువైపులా ఉన్న కొన్ని చెట్లు, రూంలను తొలగించాలని సిబ్బందికి సూచించారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

నాగర్‌కర్నూల్ క్రైం: కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొన్న ఘటన మండలంలోని వనపట్ల గేటు వద్ద శనివారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కొల్లాపూర్ నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న కారు ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొన్నది. వెనుక వస్తున్న ద్విచక్రవాహనం కారును ఢీకొనడంతో బైక్‌పై ఉన్న ఇరువురికి స్వల్పగాయాలయ్యాయి. ఘటనకు సంబంధించి ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: తాడూరు మండలంలో ఈదురు గాలుల కారణంగా విద్యుదాఘాతంతో తస్లీమాబేగం, అలియాబేగం శుక్రవారం రాత్రి మృతి చెందారు. అదేవిధంగా పిడుగుపాటుతో గుండాల శ్యామల చనిపోయింది. శనివారం జిల్లా కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్దం పర్వతాలు మాట్లాడారు. బాధిత కుటుంబాలకు ప్రకృతివిపత్తుల సహాయనిధి నుంచి రూ. 10 లక్షల ఎక్స్‌గ్రేషియో చెల్లించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు ఎన్నికల సమీక్ష సమావేశం

ఉప్పునుంతల: పార్లమెంట్ ఎన్నికలను పురష్కరించుకొని ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక కొత్త యశోద ఫంక్షన్ హాల్‌లో మండల స్థాయి ఎన్నికల సమీక్ష సమావేశం నిర్వహిస్తునట్లు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హాజరవుతారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు.

నల్లమల విద్యార్థి ఎంపిక



సాత్విక్‌చంద్ర

అచ్చంపేట రూరల్: ఆల్ ఇండియా సైనిక్ స్కూల్‌కు నల్లమల విద్యార్థి ఎంపికయ్యారు. పట్టణంలోని ఇచ్ డయాస్ స్కూల్ చెందిన బంధం సాత్విక్‌చంద్ర ఆరో తరగతి ప్రవేశ పరీక్షలో ప్రతిభ చాటి కోరుకొండ సైనిక్ స్కూల్‌కు ఎంపికైనట్లు ఆ స్కూల్ ప్రిన్సిపాల్ నవీన్ తెలిపారు. 300 మార్కులకు గానూ 274 మార్కులు సాధించి ఆల్ ఇండియా 367 ర్యాంకు సాధించినట్లు తెలిపారు.

భక్తిభావాన్ని పెంపొందించుకోవాలి

వెల్దండ: భక్తిభావాన్ని పెంపొందించుకోవాలని కాంగ్రెస్ నాయకుడు, ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని రావిచెట్టుబావితండాలోని సోమసాద్, మణసాద్ దేవాలయాల్లో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. గిరిజనులు సాంప్రదాయ నృత్యాలతో అలరించారు. ఈ సందర్భంగా దేవతలను ఊరేగించారు. అనంతరం దేవాలయంలో పూజలు చేసి మొక్కులను తీర్చుకున్నారు. కార్యక్రమంలో తండావాసులు శ్రీనునాయక్, కిమ్యానాయక్, అమృనాయక్, సద్గా, పంతులునాయక్, లక్ష్మణ్, రాజు, రాహుల్ తదితరులు ఉన్నారు.



దేవతలను ఊరేగిస్తున్న నాయకులు